వైద్యుల ప్రాణాలకు రక్షణ లేకపోతే ఎలా?..



మహిళా డాక్టర్లు, సిబ్బంది సైతం ఒక్కోసారి రోజంతా వైద్యశాలల్లోనే ఉండి పని చేయాల్సి ఉంటుంది. రాత్రి పూట విధుల్లో ఉన్నప్పుడు వార్డుల్లో వైద్యసిబ్బందికి కనీస సదుపాయాలు ఉండక ఇబ్బందులు తప్పడం లేదు. మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి రోగులు ఉండే వార్డు వద్దనే ప్రత్యేకంగా వాష్‌రూం, రెస్ట్‌రూం ఏర్పాటు చేయాలి.

కె.శ్రీలేఖ, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, బలుసుపాడు, జగ్గయ్యపేట మండలం



వార్డుల్లోనే గదులు కేటాయించాలి..



ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించే వారి ప్రాణాలకు రక్షణ లేకపోవడం బాధాకరం. కోల్‌కతాలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. అక్కడ దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలి. వాచ్‌మెన్‌లు 24 గంటలు ఉండేలా చూడాలి. అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు అమర్చాలి.

– డాక్టర్ వై సుష్మప్రియదర్శిని, అనిగండ్లపాడు ఆయుర్వేద ఆసుపత్రి, పెనుగంచిప్రోలు మండలం

క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సను కలిసిన ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మంగళవారం విజయవాడలోని ఓ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు కలిసి అభినందించినవారిలో వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, గుంటూరు మేయర్ కావటి మనోహరనాయుడు, నాగళ్ల సందీప్ తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ టౌన్: సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాలు, పట్టణంలో సేకరించిన చెత్తను రోడ్ల పక్కన పడేయకుండా డంపింగ్‌యార్డుకు తరలించటంతోపాటు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మురుగు, నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమల నియంత్రణకు బ్లీచింగ్ చల్లించటంతో పాటు మలాథీన్, ఎబెట్ పిచికారీ చేయాలని సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండటంతోపాటు జ్వర బాధితులను గుర్తించి మెరుగైన వైద్యమందించాలని ఎమ్మెల్యే కోరారు.

వెంకటేశ్వరునికి విశేషపూజలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామికి మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక హోమాలు ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణామాచార్యుల పర్యవేక్షణలో జరిగాయి. శ్రావణమాసంలో స్వామివారికి శాస్త్రోక్తంగా ఆనవాయితీగా పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కెటివిఎస్ ప్రసాద్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

30న అమ్మవారికి గాజుల అలంకారం

నందిగామ టౌన్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారికి ఈనెల 30వతేదీ గాజుల అలంకారం నిర్వహిస్తున్నట్లు ఈవో సీతారామయ్య తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రావనమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా పలు రకాల గాజులతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, మూలమంత్ర హోమాది క్రతువులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అమ్మవారి గాజుల అలంకారానికి గాజులు అందించే భక్తులు ఎరుపు, ఆకుపచ్చ, పసుపురంగు గాజులను గురువారం నాటికి ఆలయ కార్యాలయంలో అందించాలని ఈవో కోరారు.

పాఠశాల తనిఖీ

జమ్మవరం(వీరులపాడు): విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉన్నందున, ఉపాధ్యాయులంతా మెరుగైన విద్యా బోధన అందిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎంఈవో పాల్ కెనడీ పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కూడా లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కంచికచర్ల : స్థానిక ఏకత్వ స్కూల్‌లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణల్లో చిన్నారులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఉట్టికొట్టి సంబరాలు చేసుకున్నారు. పాఠశాల డైరెక్టర్ అమనరేని మనోజ్, ప్రిన్సిపాల్ సూర్యావతి, టీచర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగానే ఇసుక

- ఇసుక బుకింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నేతల హవా
- స్థానికేతరులకు అందని ఇసుక కూపన్లు
- రెండురోజులుగా జనం పడిగాపులు
- అయినా అందని కూపన్లు
- టీడీపీ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు
- ఇబ్బందుల్లో స్థానికేతరులు



ఇసుక కూపన్ల కోసం కంచికచర్ల సచివాలయం-3 వద్ద వేచి ఉన్న జనం

కంచికచర్ల: ఉచిత ఇసుక విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ అవసరమైన వారందరికీ ఇసుకను అందిస్తున్నామంటూ ప్రభుత్వపెద్దలు చేస్తున్న వ్యాఖ్యలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఇసుక బుకింగ్‌ను స్టాక్‌యార్డు పాయింట్ నుంచి సచివాలయానికి ఇచ్చినప్పటికీ సకాలంలో ఇసుక కూపన్లు అందక జనం అవస్థలుపడుతున్నారు. 'వడ్డించేవాడు మనవాడైతే' అన్నచందాన స్థానిక టీడీపీ నాయకులు, వారి అనుయాయులకు నిత్యం కూపన్లు జారీ అవుతుండగా, రెండురోజులుగా పడిగాపులు కాచిన స్థానికేతరులకు మాత్రం కూపన్లు అందని పరిస్థితి. దీంతో క్యూ పద్ధతి అనే విధానానికే ఇక్కడ విలువ లేకుండా పోయిందని స్థానికేతరులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు కంచికచర్లలోని సచివాలయం-3 వద్ద ఇసుక కూపన్ల కోసం రెండు రోజులుగా పలువురు పడిగాపులుపడుతుండటమే నిదర్శనమని చెప్పవచ్చు. రోజుల కొద్దీ వేచి ఉంటున్నప్పటికీ వారికి ఇసుక కూపన్లు జారీచేయని సదరు అధికారులు, స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతూ వారికి, వారు సూచిస్తున్నవారికి మాత్రం ఆయా పేర్లతో కూపన్లను జారీచేస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు.

స్టాక్ తగ్గుతుండటం కూడా ఓ కారణం..

స్థానిక టీడీపీ నేతలు పైరవీలు చేస్తూ ఇతర ప్రాంతాల వారికి ఇసుక దక్కకుండా ఇలా చేస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇసుక కోసం కొందరు కొనుగోలుదారులు తమ వాహనాలకు, సెల్‌ఫోన్లకు సీఎం చంద్రబాబు, టీడీపీ బొమ్మలు పెట్టుకుని వస్తుండటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. అయితే కీసర స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలు రోజురోజుకు తగ్గిపోతుండటంతో స్థానిక టీడీపీ నేతలు, ఈ ఇసుకంతా వారికే దక్కాలనే ఉద్దేశంతో ఇతరులకు కూపన్లు జారీ కాకుండా పైరవీలు చేస్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతోపాటు రోజువారీగా అందుతున్న మామూళ్లకు తలొగ్గుతూ సంబంధిత అధికారులు కూడా వారికే సహకరిస్తుండటం గమనార్హం.

పది కిలోమీటర్ల దూరం వెళ్తేనే ఇసుక..

కంచికచర్ల మండలం కీసర స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను తోలుకునేందుకు కంచికచర్ల గ్రామ సచివాలయం-3లో కూపన్లు తీసుకోవాల్సి ఉంటుంది. కూపన్లు తీసుకున్న తర్వాత ఇసుకను లోడింగ్ చేసుకునేందుకు 10కిలోమీటర్ల వరకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కూపన్లు ఇవ్వాలని కొనుగోలుదారులు అంటున్నారు.

స్థానికులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు..

ఇసుక కోసం వచ్చిన వాహనాలు కంచికచర్లలోని సచివాలయం-3 కార్యాలయం నుంచి చెవిటికల్లు సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోతున్నాయి. లారీలు, టిప్పర్లను రోడ్లపై నిలిపి ఉంచుతుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. దీంతో స్థానికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్రఅసౌకర్యానికి గురవుతున్నారు. వాహనాల రద్దీ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



కూపన్ల కోసం పడిగాపులు పడుతున్న స్థానికేతరులు



కంచికచర్ల సచివాలయం-3 రోడ్డులో ఇరువైపులా నిలిచిపోయిన లారీలు, టిప్పర్లు

చంద్రబాబు బొమ్మ పెట్టుకున్నా నో కూపన్..



ఇసుక కూపన్ కోసం వచ్చి అక్కడే నిద్రిస్తున్న డ్రైవర్

కంచికచర్లలో టీడీపీ నాయకులకు చెందిన లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లకు మాత్రమే కూపన్లు ఇస్తున్నారు. స్థానికేతరులకు మాత్రం ఇసుక కూపన్లు అందకపోవడంతో వారు సచివాలయం ఆవరణలో నిద్రకు ఉపక్రమిస్తున్నారు. సీఎం చంద్రబాబు బొమ్మ పెట్టుకుంటే స్థానికంగా కొంత ప్రాధాన్యం లభిస్తుందని భావిస్తూ పలువురు ఇసుక కొనుగోలుదారులు తెలుగుదేశం, చంద్రబాబు బొమ్మలు కనిపించేలా స్టిక్కర్లను ప్రదర్శిస్తున్నా...స్థానిక టీడీపీ నాయకులు మాత్రం అదంతా జాన్తానై..ఈఇసుక మాకే సొంతం అన్నట్లు వ్యవహరిస్తూ కూపన్ల జారీ వ్యవహారాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటూ సొమ్ము చేసుకుంటుండటం గమనార్హం.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే తాతయ్య



మంత్రి రామానాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య, ఎంపీ కేశినేని

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో సాగునీరు, తాగునీరు అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. ఎమ్మెల్యే తాతయ్య, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో కలిసి రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిశారు. ముక్త్యాల పోలంపల్లి డ్యాం అభివృద్ధి, వేదాద్రి ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడం తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. జగ్గయ్యపేటకు మంత్రిని ఆహ్వానించినట్లు చెప్పారు. ముక్త్యాల, వేదాద్రి, పోలంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్లు పరిశీలించి వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అన్ని గ్రామాలకు రక్షిత మంచి నీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తాతయ్య వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నార్త్‌జోన్ ఏసీపీ ఎం.రాజారావు సూచించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలను సందర్శించాలి



మాట్లాడుతున్న ఎంఈవో చిట్టిబాబు



మాట్లాడుతున్న ఎంఈవో డి.రవీంద్ర

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండల విద్యాశాఖాధికారి-2 ఎల్.చిట్టిబాబు మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పట్టణ, మండలంలోని సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శులు, అసిస్టెంట్లు, ఎస్ఎంసీ చైర్మన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో పాఠశాలలను తనిఖీ చేసి మౌలికవసతుల పరిస్థితిని తెలుసుకోవాలని వారికి సూచించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు మధ్యాహ్న భోజన పథకం అమలు, మరుగుదొడ్ల శుభ్రత, పరిశుభ్రతకు సంబంధించిన బాధ్యత సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: గ్రామాల్లోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రతి సోమ, గురువారాల్లో ఆయా పాఠశాలలను సందర్శించి మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ డి.రవీంద్ర సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్లు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్ఎంసీ చైర్మన్లు పాఠశాలను సందర్శించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని కోరారు. ఏఓ సిద్ధారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న రోడ్లు

- రోడ్లపైనే చెత్తాచెదారం
- ఇబ్బందులుపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



జమ్మవరం నుంచి పొన్నవరం వచ్చే రోడ్డు పక్కన దర్శనమిస్తున్న చెత్త, ఎరువు కుప్పలు

వీరులపాడు: మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్యం పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మండల పరిధిలో సుమారు 80వేల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెత్త చెదారాలతోపాటు పలురకాల వ్యర్థాల శాతం కూడా పెరుగుతూ వస్తోంది. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అధికారులు సరైన పారిశుద్ధ్య చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గ్రామశివారుల్లో రోడ్ల వెంబడి చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలతోపాటు మండల కేంద్రానికి వెళ్లే రహదారులు సైతం చెత్తాచెదారంతో నిండి దర్శనమిస్తున్నాయి.

చెత్త, ఎరువు కుప్పలే స్వాగత ద్వారాలు..

మండలంలోని ఏ గ్రామానికెళ్లినా గ్రామ ముంగిళ్లలో చెత్త, ఎరువు కుప్పలే స్వాగతం పలుకుతున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్తతోపాటు గ్రామ శివారులో నివాసముండే ప్రజలు తమ పశువుల వ్యర్థాలను సైతం రోడ్ల పక్కనే పడేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్ల పక్కనున్న చెత్త, ఎరువు కుప్పలు కుళ్లి భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. చెత్త రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని దోమల బెడదతో ఎప్పుడు ఏ రోగాల బారిన పడాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న జ్వర పీడితులు..

మండలంలోని అల్లూరు, వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు మండలానికి సమీపంలోని కంచికచర్ల పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులలో సైతం రోజురోజుకు జ్వర బాధితులు పెరుగుతున్నారని ఆయా ఆస్పత్రుల వైద్యులు చెబుతున్నారు. రెండు పీహెచ్‌సీల పరిధిలో రోజుకు ఎనిమిది నుంచి 10మంది జ్వరంతో బాధపడుతున్న వారు వస్తున్నారని వైద్యాధికారులు అంటున్నారు.

స్పందించని అధికారులు..

గ్రామాల ముంగిట చెత్త, ఎరువు కుప్పలతోపాటు గ్రామాల్లోని మురుగుకాల్వల్లో సైతం మురుగు నీరు పారుదల కాకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరు, వర్షపు నీరు రోడ్లపైకి ఎక్కి ప్రవహిస్తోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోడ్లకు ఇరు పక్కలా ఉన్న చెత్త, ఎరువు కుప్పలను తొలగించాలని అధికారులకు పలుమార్లు చెప్పినా కనీసం పట్టించుకోవటం లేదని ఆర్అండ్‌బీ రహదారుల వెంబడి చెత్త, ఎరువు కుప్పలు వేస్తున్నా కనీస చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాయామ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి వ్యాయామ అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు.అర్హతగల అభ్యర్థులు ఈనెల 31వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో జ్వరాల విజృంభణ

- గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం...
- కీళ్ల నొప్పులతో బాధపడుతున్న జనం
- అన్నవరంలో డెంగీ కలకలం



పెనుగంచిప్రోలు పీహెచ్‌సీలో బారులు తీరిన రోగులు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో దోమలు ఉధృతి పెరిగింది. దోమకాటుకు ప్రజలు వైరల్ జ్వరాన పడుతున్నారు. రెండురోజులు జ్వరం వచ్చి తగ్గినా కీళ్ల నొప్పులు, దురదలు, కాళ్లుచేతులు వాపులు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏగ్రామంలో చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వారం, పది రోజులకు కూడా ఒళ్లు నొప్పులు తగ్గక అవస్థలుపడుతున్నారు.

మహిళకు డెంగీ లక్షణాలు..

జగ్గయ్యపేట మండలంలోని జయంతిపురం, ధర్మవరప్పాడు తండా, అన్నవరం, తక్కెళ్లపాడు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంది. దీంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇంటికి ఒకరిద్దరు జ్వరపీడితులు ఉన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా ఆదిశగా చర్యలు చేపట్టకపోతుండటమే ఇందుకు కారణమనే ప్రజలు విమర్శిస్తున్నారు. అన్నవరం గ్రామంలో వారంరోజులుగా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. తాజాగా గ్రామానికి చెందిన మహిళ డెంగీ లక్షణాలతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. జిల్లా అధికారులు వస్తున్నారన్న సమాచరంతోనే కొన్ని గ్రామాల్లో తాగునీటి క్లోరినేషన్ చేస్తున్నారని ప్రజలు అంటున్నారు. వత్సవాయి మండలంలోని కంభంపాడు, వత్సవాయి, మక్కపేట, భీమవరం గ్రామాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు ఉధృతి పెరిగి వైరల్ జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి.

పెనుగంచిప్రోలు మండలంలో...

మండలంలో పారిశుద్ధ్యంపై చర్యలు పూర్తిగా కొరవడ్డాయి. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు చేరి ఉండటంతో ప్రజలు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రోజుకు 100 నుంచి 120 మంది రోగులు వస్తున్నారని, వారిలో ఎక్కువ మంది నొప్పులతో బాధపడుతూ వస్తుండటం గమనార్హం. గతంలో రోజుకు 40 నుంచి 50 మంది వచ్చేవారని, ప్రస్తుతం రోగుల పంఖ్య పెరిగిందని వైద్యసిబ్బంది చెబుతున్నారు. ప్రతి గ్రామంలో 30 నుంచి 50 మంది వరకు జ్వరపీడితులు ఉంటుండటం ప్రస్తుతం గ్రామాల్లో జ్వరాల ఉధృతికి అద్దంపడుతోంది.



అన్నవరం గ్రామంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పట్టించుకోని అధికారులు..

జ్వరాల వ్యాప్తికి దోమల కారణమని అధికారులు చెబుతుండగా, ఈ జ్వరాల దెబ్బకు ఎక్కడ ప్రాణాలు పోతాయేనని జ్వరపీడితులు బెంబేలెత్తిపోతున్నారు. జ్వరం వచ్చి చికున్‌గున్యా లక్షణాలతో రోగులు నొప్పులు భరించలేక పోతున్నారు. ఎక్కువ మంది స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యులను సంప్రదిస్తుండగా, వారు పెయిన్ కిల్లర్లు, డైక్లో ఫినాక్ ఇంజక్షన్లు చేసి తాత్కాలి ఉపశమనం కల్పిస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి నియోజకవర్గంలో జ్వరాల విజృంభణకు అడ్డుకట్ట వేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జ్వరపీడితులు కోరుతున్నారు.



గుమ్మడిదుర్రులో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

ఎక్కువమంది ఒళ్లునొప్పలతో ఆస్పత్రికి వస్తున్నారు..



ఆసుపత్రికి వచ్చే రోగుల్లో ఎక్కువమంది కీళ్ల నొప్పులు, నడుం నొప్పులతో వస్తున్నారు. జ్వరం వెంటనే తగ్గినా నొప్పులు మాత్రం వారానికి పైగా ఉంటున్నాయి. వైరల్ జ్వరాలే ఇందుకు కారణం. ఈవైరల్ జ్వరాలకు కోవిడ్‌లో పాటించిన నిబంధనలే పాటించాలి. గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయిస్తున్నాం. గ్రామాల్లో పంచాయతీ వారి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నాం, దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, నొప్పుల నుంచి ఉపశమనానికి కాల్షియం సప్లిమెంటరీతోపాటు డ్రైఫ్రూట్స్, మంచి ఆహారం తీసుకోవాలి.

– పి ఇందిర, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నందిగామ టౌన్:మండలంలోని ఆయా ఆలయాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి, గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దమండలంలోని మాగల్లు గ్రామంలోని మదన గోపాల స్వామి, పల్లగిరిగట్టుపై వేంచేసియున్న వేణుగోపాల స్వామి వారి ఆలయాల్లో మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా సుగంధ ద్రవ్యాలతో తిరువంజనం, అష్టోత్తర సహస్ర నామ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఆండాళ్ గోష్ఠి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి తిరువంజనం, ప్రత్యేక అలంకరణలు, విశేష అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఈవో ఫణికుమార్, అర్చకులు అంగర రాంబాబు, దివి వంశీకృష్ణమాచార్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.